మొక్కజొన్నకే అన్నదాతల మొగ్గు

కోనాపూర్ మండలంలోని నందిగామలో ఏపుగా పెరిగిన మొక్కజొన్న

పంటకు రక్షణగా కోనాపూర్ గిరిజన తండాలో పాతచీరలతో రక్షణ ఏర్పాటు చేసిన రైతు

- రైతులకు సిరులు కురిపిస్తున్న మొక్కజొన్న
- యాసంగిలో పెరిగిన మొక్కజొన్న సాగు
- ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి
- నాలుగు మండలాల్లో తగ్గిన పత్తి, వరి సాగు

రామాయంపేట, జనవరి 5: వరి, పత్తి పంటల సాగు తగ్గిచాలని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రచారం నేడు సత్ఫలితాలనిస్తున్నది. రామాయంపేట వ్యవసాయ శాఖ డివిజన్‌లోని నాలుగు మండలాల్లో పత్తి, వరి పంటలకు బదులుగా మొక్కజొన్న సాగును రైతులు ఎక్కువగా ఎంచుకున్నారు. ఏటా పత్తి, వరిని అధికంగా విత్తుకునే రైతులు సైతం మక్క పంటవైపు మొగ్గు చూపారు. డివిజన్ వ్యాప్తంగా గతేడాది రైతులందరూ పత్తిని పండించారు. ఈ పంటతో పాటు మధ్యమధ్యలో అంతరపంటలు ఆముదం, కంది, బెబ్బెర్లు, పెసర, శనగ సాళ్లను వేసి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. మొక్కజొన్నకు మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో యాసంగిలోఎక్కువ శాతం రైతులు ఆసక్తి కనబర్చారు. వానకాలంలో కురిసిన వర్షాలకు కొంత మంది రైతులు వరి సాగు చేయగా, ఎక్కువ శాతం మంది రైతులు మొక్కజొన్నకే మొగ్గుచూపారు.

నాలుగు మండలాల్లో 1107 ఎకరాల్లో..

డివిజన్ వ్యాప్తంగా చేగుంట మండలంలో 345 హెక్టార్లు, నార్సింగిలో 46 ఎకరాలు, రామాయంపేటలో 465, నిజాంపేటలో 251 ఎకరాలు నాలుగు మండలాల్లోని మొత్తం 1107 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. బిందు సేద్యం ద్వారానే ఎక్కువ శాతం రైతులు సాగు చేస్తున్నారు. పంట దిగుబడి ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు వస్తున్నది. క్వింటాలుకు మద్దతు ధర రూ.2200 నుంచి 2300 వరకు పలుకుతున్నది. దీంతో అన్నదాతలు ఎక్కువ మంది యాసంగిలో మొక్కజొన్న పంటవైపే ఆసక్తిని కనబర్చారు. పంట వంద రోజుల్లో రైతు చేతికొస్తుంది.

అడవిపందులతోనే ఇబ్బందులు

పంటలు నోటికాడికొచ్చే సమయంలో అడవిపందులు పంటనంతా చిందర వందర చేస్తున్నాయి. మొక్కజొన్న రక్షణ కోసం చేను చుట్టూరా కంచెలు వేయడం, పాత చీరలతో బెదురు కడ్తున్నాం. అయినా ఎక్కడి నుంచో వచ్చి చేనంతా పాడుచేస్తున్నాయి. అడవి పందులతో తీవ్ర నష్టాలకు గురవుతున్నాం. అటవీ శాఖ అధికారులు ప్రత్యేక చొరువ తీసుకుని అడవి పందులను నివారించాలని రైతులు కోరుతున్నారు.

ఖర్చు తక్కువ దిగుబడి ఎక్కువ

ఈసారి యాసంగి సీజన్‌లో ఎక్కువ శాతం రైతులు మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపారు. ఈ పంటకు ఖర్చు చాలా తక్కువ. దిగుబడి ఎక్కువగా ఉంటుంది. వర్షాభావ పరిస్థితులతో పంట ఏపుగా పెరిగి దిగుబడి అధికంగా వస్తుంది. ఈ పంటకు ఎండు తెగులు, కాండం తొలుచు పురుగు రావచ్చు. దానికి విరుగుడు కూడా పెద్ద సమస్య కాదు. వెంటనే స్ప్రే ద్వారా పురుగు మందును పిచికారీ చేస్తే పురుగు కనబడదు. ఈ మొక్కజొన్న పంటను అన్ని నేలల్లో విత్తుకోవచ్చు. పూత దశలో పంటను రైతులు కాపాడుకుంటే సిరులు కురిపిస్తుంది.

- రాజ్‌నారాయణ, ఏఈ, రామాయంపేట ఇన్‌చార్జి

గత ప్రభుత్వ ఆదరణ బాగుండేది

బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఆసరా కల్పించింది. మొక్కజొన్న పండిస్తున్న రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులను అందించింది. మొక్కజొన్నకు మద్దతు ధర కల్పించింది. గత ప్రభుత్వ విధానాలను ఈ ప్రభుత్వం అనుసరించాలి. కేసీఆర్‌కు ప్రతి రైతు రుణపడి ఉంటాడు.

- బుచ్చ మల్లయ్య, రైతు, నందిగామ

దళారుల పట్ల కఠినంగా ఉండాలి

పంటకు దళారుల బెడద ఎక్కువ. వారిపట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. వారి మూలంగా రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకుండా పోతుంది. మేము పండించిన పంట కోతకు రాగానే దళారులు చేలల్లోకి వచ్చి అగ్గువకు కొంటున్నరు.

- లంబాడి భూలి, రైతు, గిరిజన తండా కోనాపూర్

ఏడుపాయల్లో జనమే జనం

వనదుర్గామాత సన్నిధిలో భక్తులు (ఇన్‌సెట్‌లో) పూజలందుకుంటున్న అమ్మవారు

పాపన్నపేట, జనవరి 5: ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొన్నది. వేకువజాము నుంచే వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఈవో చంద్రశేఖర్, సిబ్బంది సూర్యశ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, నర్సింలు, వర్ణాచారి, రాజు తగిన ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ బందోబస్తు చేపట్టారు.

ఎల్‌వోసీ అందజేసిన నర్సాపూర్ ఎమ్మెల్యే

వెల్దుర్తి, జనవరి 5: మండలంలోని అందుగులపల్లి గ్రామానికి చెందిన డొంకెని సత్తమ్మ అనారోగ్యంతో నగరంలోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సీఎంఆర్ఎఫ్‌లో రూ. 2.10 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని ఆదివారం తన నివాసంలో బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.

కాంగ్రెస్ సర్కారు దిగజారుడుకు నిదర్శనం

– బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 5: ఎకరాకు రూ.15 వేల రైతు భరోసా ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి రూ.12 వేలకు కుదించడం సర్కారు దిగజారుడుతనానికి నిదర్శనమని బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మండిపడ్డారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే రైతులతో పాటు అందరినీ దగా చేస్తున్నాడని పేర్కొన్నారు. అన్నదాతలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు సరైన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

భక్తులతో కిటకిటలాడిన మెదక్ చర్చి


ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న భక్తులు, దైవసందేశం వినిపిస్తున్న పాస్టర్ శ్రీనివాస్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 5: మెదక్ చర్చి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే మధ్యాహ్నం వరకు జరిగిన ప్రార్థనలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఏసయ్యకు భక్తులు మొక్కులు చెల్లించుకుని చర్చి ప్రాంగణంలోని వసతి గృహాల్లో, చెట్ల కింద వంటావార్పు చేసుకున్నారు. చర్చి ప్రెసిబెటరి ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య దైవసందేశం వినిపించారు. భక్తి గీతాలు అలరించాయి. ప్రార్థనల్లో పాస్టర్లు శ్రీనివాస్, జైపాల్, డేవిడ్ రిచర్డ్స్ సీఎస్ఐ కమిటీ సభ్యులు గంట సంపత్, ప్రాంక్ జాన్సన్, సంశాన్ సందిప్, సువర్ణడగ్లస్, గెలెన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు హారిక ఎంపిక

శివ్వంపేట, జనవరి 5: మండలంలోని కొంతాన్‌పల్లి పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి కే.హారిక జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని శిక్షకుడు అల్లి నరేశ్ తెలిపారు. ఈ నెల 2న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన సెలక్షన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ఈ నెల 7 నుంచి 13 వ తేదీ వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగే సీనియర్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనందని పేర్కొన్నారు. ప్రస్తుతం హారిక బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నది. హారిక ఎంపిక పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

ఎద్దు రవి (ఫైల్)

నర్సాపూర్, జవవరి 5: కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సాపూర్‌లో జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్‌కు చెందిన ఎద్దు రవి (36) ఐదేండ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దవాఖానల్లో చూపించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. కడుపు నొప్పి తగ్గడం లేదని తన భార్యకు చెబుతూ బాధపడేవాడు. ఈ నెల 3న మధ్యాహ్నం నర్సాపూర్‌లోని మల్పర్తి చెరువు వద్ద గుర్తు తెలియని గడ్డి మందు తాగి భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లి చూడగా రవి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హుటాహుటిన నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు, అక్కడ నుంచి సికింద్రాబాద్ యశోద దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో రవిని మృతి చెందాడు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు. మృతుడికి కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రామాయంపేట, జనవరి 5: రాయిలాపూర్ గ్రామానికి చెందిన గజం చంద్రం వ్యవసాయ బావి వద్ద ఫిట్స్ వచ్చి కాల్వలో పడి మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన సంఘ సేవకుడు గట్టు ప్రశాంత్ బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశాడు.

అశ్వినికి పండుగ సాయన్న అవార్డు

రామాయంపేట, జనవరి 5: రామాయంపేటకు చెందిన సంఘ సేవకురాలు పోచమ్మల అశ్విని శ్రీనివాస్‌కు పండుగ సాయన్న అవార్డును హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మెల్సీ కోదండరాం ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో పాశం యాదగిరి, మహిపాల్ యాదవ్, నిజ్జన రమేశ్ తదితరులు ఉన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

- ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం
- 68 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం
- రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలి
- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మనోహరాబాద్: జీడిపల్లిలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

శివ్వంపేటలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మనోహరాబాద్, జనవరి 5: ఒక్కో సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, ఎన్నో క్లిష్టమైన కేసులు ఛేదించడంలో ఎంతగానో ఉపయోగపడ్డాయని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని జీడిపల్లి గ్రామానికి చెందిన దివంగత దోమకొండ అనంతరాములు, విజయ ప్రసాద్ జ్ఞాపకార్థం వెంకటరమణ సొంత డబ్బులు రూ.20 లక్షలు వెచ్చించి 68 సీసీ కెమెరాలను జీడిపల్లి, గొల్లగడ్డలో ఏర్పాటుచేశారు. వీటిని ఎస్పీ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి కోసం, నేర నియంత్రణ కోసం గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన వెంకటరమణను అభినందించారు. దాతలు ముందుకొచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలను ప్రజలు పాటించాలని సూచించారు. అనంతరం దాత వెంకటరమణ ఎస్పీ శాలువా కప్పి సత్కరించి, మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ రంగకృష్ణ, ఎస్ఐ సుభాష్‌గౌడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

రామాయంపేట, జనవరి 5: డ్రైవర్లు రోడ్లపై సంయమానాన్ని పాటిస్తూ వాహనాలు నడిపించాలని ఎస్సై బాలరాజు సూచించారు. ఆదివారం రామాయంపేటలోని మెదక్, సిద్దిపేట చౌరస్తాలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. కచ్చితంగా సీట్ బెల్టు పెట్టుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

శివ్వంపేట, జనవరి 5: డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్సై మధుకర్‌రెడ్డి అన్నారు. శివ్వంపేటలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో ఆటోడ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ అసమర్థత పాలనను ఎండగట్టాలి

- స్థానిక సంస్థ ఎన్నికల్లో బీఆర్ఎస్ జయకేతనం తథ్యం
- బీఆర్ఎస్ నాయకుడు ర్యాకల శేఖర్‌గౌడ్


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ర్యాకల శేఖర్‌గౌడ్

మనోహరాబాద్, జనవరి 5: మోసపూరిత హామీలిచ్చిన కాంగ్రెస్ అసమర్థత పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ర్యాకల శేఖర్‌గౌడ్ అన్నారు. ఆదివారం పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి, స్థానిక సంస్థల ఎన్నికలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు నాయకులు, కార్యకర్తలే పునాది రాళ్లన్నారు. పార్టీ కోసం పని చేసే ప్రతిఒక్కరికి గౌరవం లభిస్తుందన్నారు. పదేండ్ల పాలనలో కేసీఆర్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయన్నారు. కాంగ్రెస్ అసమర్థత పాలనతో ప్రజలు విసిగిపోయారని, తిరిగి కారు... సారు కేసీఆర్‌నే కోరుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్ష పదవిని వెంటనే భర్తీ చేయాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కోరారు. పార్టీకోసం కష్టపడి పని చేసేవారికి పదవి ఇవ్వాలన్నారు. కార్యకర్తల కోరికను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని శేఖర్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు రతన్ లాల్, నాయకులు మాజీ ఎంపీటీసీ లతావెంకట్‌గౌడ్, రేణు కుమార్, పంజా భిక్షపతి, నరేశ్ ముదిరాజ్, ఉదయ్‌కుమార్, వెంకటేశ్, శ్రీరామ్, సలీం, భిక్షపతి, మహిపాల్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటేలో మెదక్ విద్యార్థుల ప్రతిభ

పతకాలు సాధించిన విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 5: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రెంజుకీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్‌లోని జీకేఆర్ గార్డెన్‌లో ఈ పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, సిద్దిపేట తదితర జిల్లాల నుంచి సుమారు 2 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాలిక విభాగంలో మెదక్‌కు చెందిన యశ్వితరాజ్, సాన్విక, హన్విత, నిజగ్న, పూజిత, సుహాసిని, పృథ్వికా, చందన, హర్షియా, తణ్మయి, సహన, శ్రేష్ట, అసన్య, గౌసియా, హర్షిత, విలసిని, మనోజ్ఞ, సుప్త, బాలుర విభాగంలో మణిందర్, సాత్విక్, ఆరమాన్, ఆయాన్, ఇషాన్, నాగసాకేత్, భీమ్‌రావు, హానీ, సాయివరక్షిత్, వివిధ విభాగాల్లో బంగారు పతకాలు సాధించినట్లు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నగేశ్ తెలిపారు. విజేతలకు మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ బట్టి జగపతి పతకాలతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు.

జాతీయస్థాయి కరాటే పోటీలో హారికకు బంగారు పతకం

రామాయంపేట, జనవరి 5: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రామాయంపేట కస్తూర్బా విద్యార్థిని హారిక బంగారు పతకాన్ని అందుకున్నది. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో హారిక ప్రతిభను కనబర్చింది. అండర్ 17 బాలికల విభాగంలో హారికకు కరాటే కోచ్ రొయ్యల హరి పతకాన్ని అందజేశారు. హారిక రామాయంపేట కస్తూర్బా పాఠశాలలో 8వ తరగతి విద్యనభ్యసిస్తున్నది. ఉపాధ్యాయురాళ్లు బాలికను శాలువా కప్పి సన్మానించి అభినందించారు.

మృతుడి కుటుంబానికి కంఠారెడ్డి ఆర్థిక సాయం

రామాయంపేట, జనవరి 5: రాయిలాపూర్ గ్రామానికి చెందిన గజం చంద్రం (55) శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు.

రామాయంపేటను కమ్మేసిన పొగమంచు

రామాయంపేట, జనవరి 5: రామాయంపేట పరిసర ప్రాంతాల్లో మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోయి పొగ మంచు కమ్మేసింది. ఆదివారం చలి తీవ్రంగా ఉండడంతో రామాయంపేట జాతీయ రహదారిపై మంచు కురిసి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 5: తెలంగాణ ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 6 నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో రాధాకిషన్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 6 నుంచి 28వ తేదీ వరకు http://telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 13వ తేదదీ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న నర్సమ్మ

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 5: ఈనెల 25వ తేది నుంచి 28 వరకు సంగారెడ్డిలో నిర్వహించే సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి నర్సమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో జిల్లా కార్యవర్గసభ్యులు మల్లేశం, బాలమణి, మహేందర్‌రెడ్డి, బస్వారాజ్, భాగయ్య, అజయ్, సంతోష్ పాల్గొన్నారు.

కార్యదర్శులకు సహకరించండి

రామాయంపేట, జనవరి 5: ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో షాజులుద్దీన్ అన్నారు. ఆదివారం మండలంలోని దామరచెర్వు గ్రామంలో సర్వేను పరిశీలించారు. ఎంపీడీవో వెంట కార్యదర్శి జ్యోత్స్న తదితరులు ఉన్నారు.

సర్పంచ్ ఎన్నికపై ఖాసీంపూర్ తండావాసుల తీర్మానం

నిజాంపేట, జనవరి 5: సర్పంచ్ ఎన్నికపై గ్రామస్తులందరూ ఏకగ్రీవ తీర్మానాన్ని చేసిన ఘటన నిజాంపేట మండలంలోని ఖాసీంపూర్ తండాలో ఆదివారం జరిగింది. తండాకు చెందిన యువకుడు రాంచందర్ నాయక్ అదే తండాలో సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తానని ప్రకటించారు. దీంతో తమ ఓట్లన్నీ రాంచందర్‌నాయక్‌కే వేస్తామని 4 వార్డులకు చెందిన తండా ప్రజలు తీర్మానించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
PLOT FOR SALE
★Siddipet Town 150 yards Plot Sale: Near Govt. Degree College in Prashant Nagar Colony, Opposite Adarsha Vidhyaniketan School. 9396677876.
NT-338994
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.